# మరుత్త నృపతి

కా. పా.
రమేష్‌చంద్రప్రసాద్

దేవేంద్రునికి సాధారణంగా మనస్సుకి ప్రశాంతి వుండదు. అతగాడికి అనుమానం జాస్తి. పైగావున్నది వేయి కనులాయె. వాటితో త్రిలోకాల్లోజరిగే విషయాలు వెంటవెంటనే చూస్తూవుంటాడు. అతనికి ఎప్పుడూ తన సింహాసనాన్ని గురించిన తాపత్రయమే. అధికారవాంఛే. అది ఏ పరిస్థితులోనూ మరొక వ్యక్తికి దక్కుతుందనే భావాన్ని సహించలేడు. ఎన్ని పన్నాగాలైనాపన్ని తన అధికారాన్ని పటిష్ఠం చేసుకోవడమే అతనిపని.

నిజంగా ఆరోజు అతడి హృదయం కలవరపైపోయింది. కొద్దిసేపు కాలుగాలిన పిల్లిలా అటూ యిటూ తిరిగి చలగాలికోసం నందనవనంలో కొచ్చాడు. మందాకినీతీరాన వితర్దికపై కూర్చున్నాడు. కాని ఆలోచనలు వస్తూనే వున్నాయ్. అసలు సంగతేమిటంటే...

భూలోకంలో మరుత్తుడనే మహారాజున్నాడు. అతని తాత బోలెడు యాగాలు చేసి, ఎంతో పుణ్యం పెద్దమూటగట్టుకుని, సరాసరి, పుణ్యలోకాలకు వెళ్ళిపోయాడు. అతని అనంతరం, అతని మనుమడు మరుత్తుని ప్రభ వెలుగుతోంది ప్రస్తుతం. ఈ సారి అతడు మహోత్కృష్టమైన అశ్వమేధయాగాన్ని నిర్వర్తించబోతున్నాడు. అదీ ఇంద్రునికి భయకారణం.

'ఏమో! ఏ పుట్టలో ఏ పాముందో! ఎవరికి తెలుస్తుంది. ఇల్లా బయల్దేరినవాళ్ళే తన సింహాసనానికి ఎసరుపెటటం మామూలు. ఇప్పుడే గోటితో తీరిపోయేపనికి తర్వాత వజ్రాయుధానికి పనికల్పించటం ఎందుకు' అనుకున్నాడు దేవేంద్రుడు.

ఆలోచనా పరంపరలతో దేవేంద్రుని మనసు అల్లకల్లోలమైనది. ఏదో నిశ్చయానికి వచ్చినట్లుగా అతడు భ్రూకుటి ముడిచాడు.

ఈర్ష్య అనేది కలగకుండా వుండాలేగాని కలిగితే మానవులూ, దేవతలే కాదు, సర్వజీవరాసులూ దానికి లొంగిపోతారు. అలాంటి ఈర్ష్యాదేవి నేడు దేవేంద్రుని హృదయసీమలో అడుగుపెట్టింది.

మందంగా వీస్తున్న మలయానిలుడు, పారిజాత దివ్యసౌరభాల్ని మోసుకొస్తూ దేవేంద్రునికి ఆహ్లాదం కలిగించ ప్రయత్నిస్తున్నాడు. విరజాజులు, సురపొన్నలు ఒత్తుగా వ్రాలుతూ మనోజ్ఞ దృశ్యాన్ని కల్పిస్తున్నాయి. సరస్సులో శతపత్ర సుందరి చిరునవ్వులు ఒలకబోస్తోంది. అబ్బే! దేవేంద్రునికివన్నీ పట్టాయా!

ఆలోచనాశ్వపు పగ్గాల్ని బిగబట్టి చటుక్కున లేచాడు దేవేంద్రుడు. అల్లంత దూరాన నిరీక్షిస్తున్న భటుని చేసన్నతో పిలచాడు. వాడు దగ్గరికి రాగానే 'ఐరావతాన్ని ఆయత్తం చెయ్యి. వెళ్లు' అని ఆజ్ఞాపించాడు.

కొద్ది సేపట్లోనే ఐరావత ఘీంకారం దిక్కుల మ్రోగింది. దేవేంద్రుడు దాని నధిరోహించాడు. మంత్రి బృహస్పతి మందిరాభిముఖంగా నడక సాగించింది గంభీరంగా ఐరావతం.

* * *

అభ్యంతర మందిరంలో ఆశీనులయ్యారు బృహస్పతీ, శచీపతులు. దేవేంద్రుని కుశల ప్రశ్నలతో సంభావించి రాకకు కారణమడిగాడు బృహస్పతి.

'మరుత్తుని విషయంలో ... నన్నొక శంక బాధిస్తోంది గురూ!' నెమ్మదిగా చెప్పివేశాడు ఇంద్రుడు.

బృహస్పతి వూహించాడు, మరుత్తునిపై యింద్రునికి ఈర్ష్య కలిగిందని. కారణం కనిపిస్తూనే వుంది. కొంచెం ఆగి అన్నాడు బృహస్పతి.

'త్వరలో మరుత్తుడొక యజ్ఞం చేయబోతున్నట్లు విన్నాను. కొద్దిదినాలక్రితం అతడే సూచించాడు నాకు, నన్నుపదర్శకత్వం వహించమని కూడా కోరాడు. అతని తాతకు మా తండ్రి ఉపదర్శకత్వంచేసి యజ్ఞాలన్నీ జయప్రదంగా జరిపించేవారనీ, అది పురస్కరించుకుని నన్ను ప్రార్థిస్తున్నట్టుగా చెప్పాడు. ఈ సంగతి ఇదివరకే చెప్పానుగా నీకు. అయితే దేవేంద్రా! మరుత్తునివలన నీకేమైనా కీడు కలుగుతుందేమోనని అనుమానిస్తున్నట్టుందే నీవు!'

'మరుత్తుడు చేయబోయే మహనీయ యజ్ఞాన్ని బట్టి ప్రమాదాన్ని శంకించటంలో తప్పేమీలేదు. ఇలాటివాళ్ళే ఏకుమేకై కూర్చొనేది. ఇంతకీ నీవేమి నిశ్చయించుకున్నావు? యాజకత్వం వహించదలచుకున్నావా?' ప్రశ్నించాడు ఇంద్రుడు.

దేవేంద్రుని ముఖములో స్ఫురించే భావాల్ని అవగాహనచేసుకో ప్రయత్నిస్తూ బృహస్పతి యిలా అన్నాడు: "సాంప్రదాయాన్ని బట్టి నన్నుపదర్శకత్వం వహించమని కోరాడనుకో. అయితే నీ అభిప్రాయ మేమిటో చెప్పు. నీ భావాన్ని దాటిపోను కదా!'

దేవేంద్రుడు మనసు విప్పుకున్నాడు. 'నాయజ్ఞాలకు కర్తృత్వం వహించే నీవు యిలా ఒక సామాన్య మానవునియాగానికి యాజకత్వం వహించటం బాగుండదు. ఇక నీ వంటి ప్రజ్ఞానిధి, మహానుభావుడు లేకపోతే అతని యాగమూ జయప్రదం కాదు. ఏమంటావు మరి! నీ వారాజును తిరస్కరిస్తే నేను సంతోషపడతాను.'

బృహస్పతి ఒక్క నవ్వు నవ్వాడు. 'అలాగే' అనేశాడు తేలిగ్గా. ఇంద్రుడు తేలికపడ్డ మనస్సుతో ఐరావతం ఛెంగున ఎక్కాడు.

* * *

యజ్ఞానికి సర్వసంభారాలూ సమకూర్చుకుని మరుత్తుడు బృహస్పతి అనుజ్ఞకోసం, ఆహ్వానించటంకోసం వచ్చాడు. కర్ణాకర్ణిగ దేవేంద్ర బృహస్పతుల మంతనం యితని చెవికి సోకింది. ఇంద్రుని కుటిలత్వం అర్థమైంది. అయినా తాను విన్న ప్రవాదంలో నిజమెన్నిపాళ్ళున్నదో స్వయంగా తెలుసుకుందామని బయల్దేరి వచ్చాడా రాజు ఒక సుప్రభాతాన.

ముఖమున ఆతురతాభావం ప్రతిఫలిస్తుండగా తన సన్నిధికి వచ్చిన రాజును బృహస్పతి ఆహ్వానించాడు. ఆ ఆహ్వానంలో ఏదో నిగూఢత దాగివున్నట్లు పసిగట్టాడు మరుత్తుడు. మనస్సు శంకాపూరితమైంది. తాను చెప్పదలచుకున్న విషయాన్ని సహజ వినమ్రోక్తులతో దేవగురువు ఎదుట పెట్టాడు.

'మీరు కర్తృత్వం చేస్తారనే ఆశయంతోనే నేనీ ప్రయత్నాన్ని తలపెట్టాను. యజ్ఞాన్ని సమారంభించే సమయం ఆసన్నమైంది. త్రిదశవర్యా! 'నా మీద కారుణ్యా

# మరుత్త నృపతి

భావంతో విజయంచేసి నన్ను కృతకృత్యుణ్ణి చేయండి.'

సమాధానం చెప్పటానికి బృహస్పతి విలంబనం చేయలేదు. 'ఇంద్రుడు తన యజ్ఞాని కుపద్రష్టగా నన్ను ముందే నియమించాడే. నీ యజ్ఞానికి రావటానికి నాకు కురి వీలుపడదు' అన్న పలుకులు మరుత్తుని కర్ణాలకు శూలాలై ఆ బుద్ధిమంతుని నోట వెలువడినవి. యథారాజా తథా మంత్రీ!

బృహస్పతి యింత కఠినంగా మాట్లాడి తన్ను తిరస్కరిస్తాడని మరుత్తుడు కలనైనా వూహించలేదు. విచారము, ఆగ్రహము, ఆశ్చర్యం, అవమానం కలసి వింత ముద్ర వేశాయి మరుత్తుని ముఖాన.

'మీరు అనుగ్రహిస్తారన్న తలంపుతో ఇంతప్రయత్నం చేశాను. ఈ ఒక్కసారికి నా తప్పుల్ని క్షమించండి. ఇంతకన్న మరేం కోరను' అన్నాడు మరుత్తుడు దిగులు ధ్వనిస్తున్న కంఠస్వరంతో.

పొమ్మంటే నీకొద్దూ అన్నట్లు చూశాడు బృహస్పతి. అతని తీక్ష్ణదృక్కులు వెక్కలి పదునుగా మరుత్తుని హృదయానికి సూటిగావచ్చి తగిలాయి. "దేవతల యజ్ఞయాగాదుల్లో సర్వగౌరవాలు పొందుతున్న నేను, ఒక మర్త్యుని యజ్ఞానికి యాజకత్వం వహించను. పలుమారు నా నిశ్చయాన్ని చెప్పించుకోకు. మరొకరెవరైనా నా బదులు దొరుకుతారేమో! అన్వేషించుకొమ్ము' అన్నాడతడు తిరస్కారం మిళితమైన స్వరంతో.

మరుత్తుని ముఖాన కళదప్పింది. విషణ్ణవదనంతో నిష్క్రమించవలసి వచ్చింది. ఏమేమో అనుకుంటూ, ఆలోచిస్తూ నడుస్తున్నాడు. 'ఛీ ఛీ ఆయన నన్నిలా అవమానించాడు! యజ్ఞానికింకొక మహానుభావుడెవరు లభిస్తాడు' లజ్జాభావంతో అతని మోము కుంచించుకొనిపోయింది. ఆలోచిస్తూ, అడుగులోఅడుగు వేసుకుంటూ మరుత్తు డధిగమిస్తున్నాడు.

సరిగమపదనిస సంజ్ఞాస్వరాలు మహతిపై మంజులనాదాలు వెలిగ్రక్క నయనమోమటు త్రిప్పిన మరుత్తునికి అల్లంతదూరా త్రిలోకసంచారి నారదుడు దృగ్గోచరుడైనాడు. మదిలో కలత మాపుకో ప్రయత్నిస్తూ, వినయభావంతో కలహభోజనునికి అభివాదం చేశాడు.

ముఖంలో చిరునవ్వు మెరపిస్తూ ఆశీర్వదించి అన్నాడు నారదుడు: "అదేమిటి? రాజా! దిగులుగా వున్నావేం! మహాయజ్ఞానికి ఆరంభిస్తూన్న నీకు విషాదానికి కారణమేమిటయ్యా! చెప్పు. తీర్చలనేమో చూస్తాను' ఒక్కొక్కప్పుడు పనిలేక కలహాలు పెట్టేవాడైనా ఒకొక్కప్పుడు కలహప్రియత్వం విస్మరించి కారుణ్యనిధి అవుతాడా బ్రహ్మమానసపుత్రుడు.

నారదుని ప్రియవాక్కులు మరుభూమిలో వానజల్లుమాదిరి మరుత్తుని మనస్సుకు హాయినిచ్చినై. ఆ వూరడింపు పలుకులతో సర్వం మునికి నివేదించుకున్నాడు.

అంతావిని నారదుడు వున్నట్టుండి పకపకనవ్వాడు. 'బాగుంది. బలేబాగుంది. బలే గూడుపుఠాణీ చేశారన్నమాట వాళ్లిద్దరూ. సరిసరి. ఇంతకీ నీ దిగులుకు కారణమేమిటి? బృహస్పతితప్ప మహానుభావులు మరి లేక లోకం గొడ్డుపోయిందంటావా ? నీ యజ్ఞం పూర్తికాదని భయమా ! బృహస్పతితమ్ముడు సంవరుడనేవాడున్నాడు. అతడు నీ యజ్ఞాని కుపదర్శనం చేయగల మహానుభావుడు, సమర్థుడూను.'

'సంవర్తుడా! ఎక్కడుంటాడతడు! చెప్పు! నారదమునీ!' మరుత్తునిస్వరం వుత్కంఠను మేళవించుకొంది.

'బృహస్పతి అవజ్ఞ కారణంగా సంవర్తుడు సర్వసంగపరిత్యాగి అయినాడు. అన్న ధిక్కారం అతనిని విరాగినిచేసింది. దిగంబరుడై సంచరిస్తున్నాడు కాశీపురంలో ఉన్మత్తునిలా ప్రవర్తిస్తూంటాడు.

మరుత్తుని హృదయం క్షణంలో సంశయపూరితమైంది. 'అయితే మునీంద్రా! అతడు నా ప్రార్థనను మన్నిస్తాడనే నమ్మకమేముంది? అతనితో సంభాషించటానికైనా అవకాశం యిస్తాడో! యీయడో. అసలతన్ని నేనెలా గుర్తించటం?'

'అవును. రాజా! నీ ఆందోళన సరి అయిందే. నీ సందేహాలకు సమాధానం చెప్తానుండు. కాశీకి వెళ్ళి దిక్కుమాలిన శవాన్నొకదాన్ని పెట్టుకుని పురద్వారందగ్గరే కూచో. నీకు సమీపంగా వస్తున్నవారిని కొంచెం జాగ్రత్తగా వీక్షిస్తూవుండు. ఇంతలో పిచ్చివానిలా వున్నతడు వస్తాడు. నీ దగ్గరవున్న శవంచూచి చివ్వున వెనుదిరిగి పరుగెత్తుతాడు. అలా పరిగెత్తినమనిషే సంవర్తుడని గుర్తుంచుకో. వెంటనే అతనిని అనుసరించు. ఏకాంతంగా అతడు కనుపించినచోటనీ ప్రార్థనను నివేదించుకో. సరేనా! అంతా బాగానే వుంది కాని...ఇదంతా ఎవరుచెప్పారు నీకని అడుగుతాడేమో నిన్ను. నా పేరుచెప్పకగాని ఇప్పుడు నారదు డెక్కడున్నాడని అడిగితే నాకీ సంగతులు చెప్పి నారదుడు అగ్నిప్రవేశం చేశాడని తపీమని చెప్పెయ్యి. సరేనా!'

చిరునవ్వుతో మునికి నమస్కరించాడు రాజు. అతనిమనస్సు తేలికైంది.

* * *

అతురాలా నారదముని చెప్పినట్లుచేసి సంవర్తుణ్ణి కలుసుకున్నాడు రాజు. పరుగెత్తి పరుగెత్తి విసిగి ఒక చెట్టునీడన కూర్చున్న సంవర్తుని దగ్గరకువెళ్ళి భక్తిప్రపత్తులతో నమస్కారం చేశాడు.

పిచ్చిచేష్టలు యిక చేయదలచుకో లేదు. సంవర్తుడు. తలెత్తి అడిగాడు. 'ఎవరు నీవు, ఎందుకు నా వెంటపడ్డావు? నా గురించి అసలు నీకు చెప్పిందెవరు ?' అని.

మరుత్తుడు చలించకుండా సమాధానం చెప్పాడు నారదుని విషయంతో సహా.

సంవర్తుడు క్షణంసేపు పెదవి విప్పలేదు. అతని నేత్రాలు ఆనందభావంతో మిలమిల్లాడాయి. 'రాజా! నీ ఆశయం సరి అయినదే. కాని ఒక్కమాట. పెద్దవాళ్ళుండగా చిన్నవాళ్ళకు పెత్తనమివ్వటం బాగుంటుందా నీవే చెప్పు. మా యన్న బృహస్పతి వున్నాడు. బుద్ధిమంతుడని వేనోళ్ళ ప్రసిద్ధి. తపోబలం అంతా యింతా కాదు. ఆబలం చేతనే నన్నవమానించాడు. విరక్తితో సర్వం పరిత్యజించి యిల్లా పరిభ్రమిస్తున్నాను. మా యిద్దరిలో నీవు మా అన్ననే ఎన్నుకుంటే సర్వవిధాలా వుత్తమంగా వుంటుం దనుకుంటాను. ఒకవేళ కాదంటావో, పెద్దల ఆజ్ఞలేకుండా ఏదైనా చెయ్యటం మంచితనం అనిపించుకోదు. నీవీ విషయంచెప్పి మా అన్న నడిగి అనుజ్ఞ తీసుకురా. నీ యాగాన్ని జయప్రదంగా




సుఖజీవిత సేవ

భారత "సిద్ధ వైద్య మహిమ" మన దేశ సిద్ధుల సాటిలేని కీర్తికి ఒక తార్కాణము.

"మేల్ మాయిల్ మందు"

ప్రపంచములో ప్రఖ్యాతి గాంచిన మేహ, కుష్ఠరోగనివారిణి భయంకరమైన మేహ వ్యాధివల్ల కష్టపడువారలకు పునర్జన్మమిచ్చు అద్భుత సంజీవి మేహరోగ నివారణ మాత్ర, లేహ్యము.

డా॥ కే. టి. కృష్ణమూర్తి ఆచారి & సన్సు,

5/22, మేల్ మాయిల్. (P. O.) (N. A. Dt.) S. India.

నేను నడిపిస్తాను. ఏమంటావు?'

మరుతుని ముఖం రంగుమారింది. వెంటనే అన్నాడు: 'ముందే వెళ్ళాను మహాను భావా! కాని ఒక మానవుని యాగానికి అధ్వర్యం వహించవని స్పష్టంగా చెప్పి వేశారు బృహస్పతి. సామీప యీర్ష్యతో యింద్రుడు చెప్పిన మాటలువిని నన్నవ మానంచేసి వెడలనడిపించారు. అందుకేగా మిమ్మల్ని వెతుక్కుంటూ వచ్చాను. మళ్లీ ఎలాపోను? మీరే చెప్పండి.'

దీనభావం చూచిస్తున్న మరుత్తుని ముఖంపై దృష్టినిలిపి సంవర్తుడు కారుణ్యంతో 'అలాగే కానీ'మ్మన్నాడు. కాని ఒకషరతు. నీయాగానికి ఉపద్రవవటానికి నేను సిద్ధం. కాని యీ విషయం తెలిసీ మా అన్నా, యింద్రుడూ యీర్ష్యతో ఏమైనా చేయగల సమరులు. వారుచేసే పనులకు నీవు చలిసే నీకు శాపం తప్పదు. కాబట్టి ముందే నిశ్చయం చేసుకోవటం మంచిది. అంత్య నిష్ఠూరంకన్న ఆది నిష్ఠూరం మేలుకదా!

'నాది స్థిర నిశ్చయమే. పరులమాటవిని మిమ్మల్ని వంచపలుస్తానా? అలా అయితే సూర్యచంద్రు లున్నంతపర్యంతం నాకుపుణ్య లోకప్రాప్తి లేకుండా పోతుందని శపథం చేస్తున్నాను' అన్నాడు మరుత్తుడు.

ఇద్దరికి సంశయనివృత్తి అయింది. యాగానికి కావలసిన దానికంటే అమితంగా బంగారం సమకూరుస్తానని హామీ యిచ్చి సంవర్తుడు హిమాలయో త్తరభాగానికి తీసుకు వెళ్ళాడు మరుతుని. అక్కడ ముంజవంతమనే పర్వతంమీద పార్వతీ పరమేశ్వరులు ప్రమథగణాల్తో సహా విహరిస్తున్నారు. సంవర్తుడు శివుని ప్రార్థించి ప్రసన్నుణ్ణిచేసు కొన్నాడు. ఇద్దరూ ఆకొండలో వలసినంత పసిడి తవ్వి తెచ్చుకున్నారు. యజ్ఞ సంభారాలు సమకూర్చటంలో నిమగ్నులై పోయారు. యజ్ఞవాటిక సువర్ణకాంతు లీనుతోంది. దేవలోకాన్ని తలదన్నే వైభవం యీ యజ్ఞవాటికలో వెల్లివిరుస్తోంది.

* * *

'అన్నన్నా! ఎంతపనిజరిగింది! మరుతుడెంతపని చేశాడు? అసలు నారదుడెందుకు వచ్చాడు మధ్యలో! ఎలా యీ అపాయం గడవటం'

బృహస్పతికి ఒకటే దిగులు. కాలూ, చేయీ ఆడటంలేదు. సంవర్తుడొచ్చాడు రంగంలోకి తనమీద సవాలుకన్నట్లుగా! ఏమిటి చేయటం!

'గురూ! అసలు వుత్సాహంగా వుండటం లేదే యీ మధ్య. ఏమిటి మీదిగులు. మీకెవరపకారం చేశారు. ఎందుకు మీ కీవైక్లబ్యం! చెప్పండి. దాని క్కారణం అయినవాళ్ళని పటిస్తాను' అన్నాడు దేవేంద్రుడు బృహస్పతిని చూస్తూ.

ఏం చెప్పాలి!...కాని చెప్పాలి. సంవర్త, దేవేంద్రుల మధ్య అగ్నికీలలు చెలరేగాలి. అప్పుడే తన మనోరథం ఈడేరుతుంది.

'ఏముంది? ఆ మరుత్తుణ్ణి తిరస్కరించి పంపేశాను. అతడు పోయి, నారదుడేదో ఊదినట్లున్నాడు చెవిలో, సంవర్తుణ్ణి తెచ్చుకున్నాడు. ఇద్దరూ కలసి యజ్ఞం ప్రారంభించబోతున్నారు.' అన్నాడు నొసలు ముడిచి.

'ఆ...యింత జరిగిందా!' విస్తుపోయాడు శచీపతి. 'అయితే యిక వూరుకోనిలాభం లేదు. త్వరగా కార్యాచరణకు పూనుకోవాలి. మధ్య యీ సంవర్తు డెక్కడ దొరకాడయ్యా బాబూ!' అంటూ దేవేంద్రుడు ప్రక్కనేవున్న అగ్నిదేవుణ్ణి చూచి యిలా అన్నాడు. 'త్వరగా భూలోకానికి వెళ్ళు. మరుత్తుడనే రాజు యజ్ఞంచేయబోతున్నాడు. యాగానికి కర్తృత్వం బృహస్పతే నిర్వహిస్తాడని చెప్పు. అలా ఆరాజును ఒప్పించి తిరిగిరా. వెళ్ళు.'

అలా గేనంటూ అగ్ని అంతర్హితుడైనాడు.

* * *

యజ్ఞశాల అంతా సంరంభంతో నిండి కోలాహాలంగావుంది. చుక్కల్లో చంద్రునిలా తిరుగుతూ అజమాయిషీ చేస్తున్నాడు సంవరుడు. మరుత్తుని కండలో సంతృప్తి మెరుస్తోంది. యజ్ఞవేదిక అంతా బంగరు కాంతులు కురిపిస్తూ సంవర్తుని ధీమహిమను చాటుతున్నదా అనిపిస్తోంది. మణిమయ తోరణాలు చిరుగాలికి అల్లలాడుతూ వింత వింత రంగులను కల్పిస్తున్నాయ్.

'స్వాగతం! అగ్నిదేవులకు. అలా ఆసీనులుకండి' వినయభావం కురిపిస్తూ అభ్యర్థించాడు మరుత్తుడు. అగ్నిరాక తెలిసి సంవర్తుడు ముందుకువచ్చి ఆసీనుడైనాడు.


అగ్ని, సందేశం వినిపింప ఆయత్తుడైనాడు. 'దేవేంద్రుడు నన్ను దూతగా పంపితే వచ్చాను.'

'అలాగా! అయితే పరమసంతోషం. అతడు క్షేమమేనా? నాపట్ల సద్భావం వుందా అతనికి చెప్పు, అగ్నిదేవా!' అన్నాడు మరుత్తుడు.

'అతడు క్షేమమే. నీపట ఆతనికి ఆదరం వున్నది. ఇక నే నెందుకు వచ్చానో చెబుతాను. నీవు చేయబోతున్న యజ్ఞానికి బృహస్పతి కర్తఅయి సర్వభారం నిర్వహిస్తాడు. సకలదేవాళి మోదయోగ్యంగా నీ క్రతువును జయప్రదంచేసుకో, అని చెప్పమన్నాడు దేవేంద్రుడు నీకు."

మరుత్తుడూ, సంవర్తుడూ ముఖముఖాలు చూచుకున్నారు. సంవరుడు మౌనం అవలంబించాడు. ముఖం గంభీరాకృతి దాల్చింది. 'నేను ముందేచెప్పలేదూ!' అన్నభావం అతనిచూపులో తళుక్కుమంది. మరుత్తుని మదిలో వెయ్యి ప్రశ్నలు ద్భవించాయి. 'ఏమిటీమాట! నా యజ్ఞ యాజకత్వాన్ని బంతిలాచేసి ఆటలాడుదామనుకుంటున్నారు శచీపతీ, బృహస్పతులు. బ్రతిమాలినప్పుడు తిరిమేసి మరల కాళ్ళబేరమా! బాగుంది.'

ఆలోచన లణంచుకొని వెంటనే చెప్పాడు రాజు. 'అగ్నిదేవా! నా నమస్కారాలు ఆ దేవేంద్రునికి అందజేయి. ప్రార్థించినప్పుడు అవజ్ఞ చేసి నాదారి నే చూచుకున్న తర్వాత మళ్ళీ ఇదేమిటి? నాకీ మహానుభావుడు ప్రసన్నుడైనాడు. నాకీతడుచాలు.



# ★ మరుత్త నృపతి ★

ఇదే నామాట.'

ప్రథమ ప్రయత్నం విఫలం కాగా మరో బాణం విసిరాడు అగ్ని. 'బృహస్పతిని కర్తగా నియమిస్తే పుణ్యలోకాలు కరతలామలకాలవుతాయి. ఆలోచించుకో.' ఈ బాణం దివ్యంగా పనిచేస్తుందనుకున్నాడు. కాని విఫలమవుతుందనుకోలేదు.

అగ్నిదేవుని యీ మాటలతో సంవర్తుని కన్నులు అగ్నికణాలు కురిశాయి. తీక్ష్ణ స్వరంతో అన్నాడు: "ఇంకా ఆ ధోరణిలోనే ప్రసంగించావంటే నా కోపదృష్టిచే నిన్ను భస్మీపటలం చేస్తాను. జాగ్రత్త వెళ్ళిపో."

అగ్ని భయకంపితుడైనాడు. సంవర్తుని బెదిరింపుతో నవనాడులు క్రుంగిపోయినా, వెంటనే నిష్క్రమించాడు హడలిపోయి.

* * *

చిన్నబోయిన ముఖంతో, తిరిగి వచ్చిన అగ్నిబాలకం చూడటంతోనే దేవేంద్రునకు విషయం తెలిసిపోయింది. అగ్ని సమస్తం నివేదించాడు తను హడలిపోవటం తప్ప. అది కూడా చెబితే అందరూ నవ్వరూ!

ఇంద్రునికి మండిపోయింది. తనమాటను ధిక్కరిస్తాడా ఒక మానవుడు!

'అగ్నీ! మళ్ళీ వెళ్ళు. మరుత్తునితో చెప్పు. నేను చెప్పినట్లు చేయకపోతే వజ్రాయుధాన్ని పంపి ఆ రాజును యమసదనానికి పంపిస్తానని చెప్పు. తిరస్కరిస్తాడూ నామాట అంతకంత అనుభవిస్తాడు. శీఘ్రం బయల్దేరు'

సంవర్తుని క్రోధదృక్కులు అగ్నిని యింకా వెంటాడుతున్నట్టువుంది. గుండెల్లో భయం యింకా తగ్గనేలేదు. మళ్ళీ వెళ్ళటమే!

'నేను వెళ్ళను. సంవర్తుడు కోపంతో నన్ను దహిస్తానని కేకలు వేశాడు. నాకు భయంగావుంది. మరెవ్వరినైనా పంపు.' బడికి పొమ్మంటున్న తండ్రి ముందు ఏడుపు ముఖంతో నిలబడ్డ పిల్లవానిలా వుంది అగ్ని వైఖరి.

అంత ఆర్భాటంలోనూ దేవేంద్రునికి నవ్వు వచ్చింది. 'నీవే ఇతరుల్ని దహిస్తావు గాని నిన్నొకళ్ళు దహించటమేమిటోయ్. ఎందుకు పిచ్చి అరుపులు అరుస్తావు'

ఈసారి అగ్నికి ఉడుకుమోత్తనం వచ్చేసింది. ఒక్కసారిగా లేచి ఇంద్రుణ్ణి చెడామడా కడిగేశాడు: 'బ్రహ్మబలం నీకు బాగానే తెలుసు కదయ్యా! మూడులోకాలకధిపతివి. అలాంటివాడివి వృత్రుడికి ఓడిపోయావెందుకూ! త్వష్టకుడు నిన్ను ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీరు త్రాగించటం మరిచిపోయావేమిటి? వజ్రాయుధంతో ఆ మునినే సాధిస్తాననుకున్నావు కాని అతడే నీ పంతమణచాడే! వట్టి నేకబురు చెప్పకయ్యా బాబూ! తనదాకా వస్తేగానీ తెలీదు. నేను మాత్రం వెళ్ళేదిలేదు! ఖచ్చితంగా చెప్పి అవతలకు వెళ్ళిపోయాడు అగ్ని.

'సరి. నీవు వెళ్ళకపోతే మానుకోగానీ అతడికి నన్నుకూడా భయపడమంటావేమిటి!' అంటూ ఇంద్రుడు గంధర్వరాజైన ధృతరాష్ట్రుణ్ణి కబురంపి పిలిపించాడు దూతకృత్యానికి.

* * *

ధృతరాష్ట్రుడు వెళ్ళే సమయానికి సభాభవనంలో సంవర్తునితో ఏదో ముచ్చటిస్తున్నాడు మరుత్తుడు. యుక్తమర్యాద చేసి ఆసనం చూపారు అతనికి.

'ఇంద్రుని దూతగా వచ్చాను. బృహస్పతిని నీ యజ్ఞానికి కర్తగా అంగీకరిస్తే అతడు సంతోషించి నీకు వరాలిస్తాడు. అలా కాదు కూడదంటావా వజ్రాయుధానికి పనికల్పించినవాడవవుతావు. ఏది చేయదల్చుకున్నావో వివరించి చెప్పమన్నాడు ఇంద్రుడు' ధృతరాష్ట్రుడు చెప్పాడు.

'బృహస్పతిని కర్తగా నేను ముందే కోరాను. కాళ్ళావేళ్ళాపడి ప్రార్థించినపుడు కాలదన్ని అవమానం చేశాడు. విరక్త హృదయుడనై నారదుని ప్రబోధంతో ఈ మహానుభావుణ్ణి ఎన్నుకొన్నాను. ఇప్పుడు మిత్రద్రోహం చేయుటం నావల కాదు. ఎవరెన్ని చెప్పినా నా అభిప్రాయం మారదు. అలా నా మాటగా యింద్రునికి చెప్పండి.' మరుత్తుని వాక్కులలో గాంభీర్యం గడ్డకట్టి నాట్యమాడింది. స్థిరత్వం సూచిస్తున్నదాతని కంఠస్వరం.

ధృతరాష్ట్రుడన్నాడు. 'సరే. నీ అభిప్రాయం నీవు చెప్పావు. తదనుగుణంగా యింద్రుడూ చేస్తున్నాడు. అదిగో వజ్రాయుధ కఠోరస్వనం. ఎలా ఓర్చుకోవాలో యోచించుకో. ఓర్చుకోటానికి సంసిద్ధం కా.'

వజ్రాయుధ భయంకరధ్వని అందరి కర్ణాలలో సోకింది. మరుత్తుని హృదయం భయకంపితమైంది. సంవర్తుని శరణుజొచ్చాడు. 'దేవా వజ్రాయుధ కలకల మదిగో. సభ్యులు భయపడుతున్నారు. మీరే మాకు గతి'

సంవర్తుని ముఖంలో అతని మహోగ్ర తపోబలానికి చిహ్నంగా దివ్యజ్యోతి తళుక్కున మెరిసింది. కన్నులు గాఢ ప్రశాంతత చిలికాయి. శాంత వాక్కులతో మరుత్తుని, సభ్యుల ఆరాటాన్ని తగ్గిస్తూ యిలా అన్నాడు: 'భయంవద్దు నా తపోమహిమ యింద్రుడెఱుగనిది కాదు. సంస్తంభ విద్యాప్రాశస్త్యంతో వజ్రాయుధాన్ని నిర్వీర్యం చేస్తాను. దేవతల మిగిలిన ఆయుధాలు మరేమీ అపాయం చేయలేవు. గుప్పవన సహాయమూ, చండవృష్టి సహకారమూ మనకు సంపూర్ణంగా వున్నాయి. విరోధవర్గానికి భయపడవలసిన అవసరమే లేదు!

మరుత్తుని వంక తిరిగి యిలా అన్నాడు సంవర్తుడు: 'వజ్రాయుధానికి భయపడవద్దు నీకు కలసిన కోర్కెలు కోరుకో తీరుస్తాను.'

అభయహస్తమిస్తున్న తపోనిధి ధైర్యపూరిత వాక్కులు మరుత్తుని సేదదీర్చినయ్. సంవర్తునికి భక్తితో వందనం చేస్తూ 'దేవా! ఇంద్రుడు నామీద యీర్ష్య వహించి వున్నాడు, యజ్ఞసమయాన అతడు నాపై ఈర్ష్యాక్రోధాలు విస్మరించి, యిక్కడకువచ్చి తన హవిర్భాగం తాను స్వీకరించేట్టు చూడండి. తక్కిన దేవతలందరూ కూడా వచ్చి హవిస్సు గ్రహించి వచ్చేట్టు చేయండి. నా యజ్ఞం సర్వలోక మనోజ్ఞంగా సంపూర్తి అయేట్టు చూడండి. అంతకన్న నేను మరేమీ కోరను'


'అలాగే' అన్నాడు సంవర్తుడు. 'నా ఆహ్వానాన్ని పురస్కరించుకొని యజ్ఞారంభం అవుతూనే సురకోటి యజ్ఞవాటికను పునీతం చేస్తారు చూస్తూండు.'

వజ్రాయుధ కలకలం' సంవర్తుని వదనంలో ప్రజ్వలకాంతి అతని చిరునవ్వు సమస్తలోకాల్ని జయించే ప్రభావాన్ని సంతరించుకొంది. చేరువౌతున్న వజ్రాయుధాన్ని ఒక్కమాటు చూచి చేతనున్న శక్తిని మంత్రించి వదిలాడు. వజ్రాయుధకల కలం శక్తిప్రభంజనం ముందు స్తంభించినిలచింది. సభికులంతా ఆశ్చర్యవదనులై సంభ్రమంతో వింత తిలకిస్తున్నారు. ఆనంద కోలాహలంలో ఆ సభాభవనం కల్లోల జలధిలా కదిలిపోయింది.

* * *

యజ్ఞశాల అంతా కలకలలాడుతోంది. మానవులూ, దేవతలూ కలసివున్న ఆ ప్రదేశమంతా కన్నుల పండువై

(45-వ పేజీ చూడండి)



# మరుత్త నృపతి

(30-వ పేజీ తరువాయి)

భాసిస్తోంది. సంవర్తుని అపూర్వ మంత్రశక్తికి కట్టుబడి మరుత్తుని ఆహ్వానాన్ని తిరస్కరించలేక దేవేంద్రుడు యజ్ఞానికి విచ్చేశాడు. అగ్ని పలికిన మాటలు స్మృతిపథంలో మెరిసినయ్. 'బ్రహ్మబలం అంతా యింతా కాదయ్యా, నీకనుభవమేగా!' దేవేంద్రునితో మంత్రి, తక్కిన దేవతలూ విచ్చేశారు. యథారాజా తథా ప్రజా!

మరుత్తుడు, సంవర్తుడు అతిథులందరినీ సమస్త మర్యాదలతో సంభావించి అర్హాసీనుల్ని చేశారు. మరుత్తుడు వినయం తన సహజ స్వభావానికి మెరుగులు పెడుతూండగా ఇంద్రునికి నమస్కరించాడు. 'దేవేంద్రా! నీరాకతో యీ యజ్ఞశాల పావనమైంది. కరుణామూర్తివై కోపం విరమించినందుకు నా వందనాలు. ఈ మహానుభావుడు నా క్రతుకర్త. బృహస్పతి సోదరుడని నేను చెప్పే పనిలేదేమో! సంవర్తుడు బృహస్పతి సోదరుడే కాబట్టి మీరు నన్ను కోపించరనుకుంటాను.'

దేవేంద్రుని పెదవులపై లీలగా చిరునవ్వు మెరిసింది. అతని హృదయంలో చెలరేగిన వ్యతిరేకభావాలు సంవర్తుని మంత్రశక్తిచే ఆహూతుడైనప్పుడే సమసిపోయినై మరుత్తుని సంవర్తుని సంభావించటం తప్పనిసరైంది. అక్కడేవున్న అగ్ని చిరునవ్వు అందుకుంటూ యిలా అన్నాడు. 'అవును. సంవర్తుడు తపోబల సంపన్నుడు. అతిడన్ని విధాలా తగినవాడే. నాకు సంతోషంగా వుంది. అన్నాడు దరహాసం చిందిస్తూ దేవేంద్రుడు.'

అన్నకు నమస్కరించేసి, దేవేంద్రుని యిలా సంభావించాడు సంవర్తుడు. 'దేవేంద్రా, మీ రాక మాకు ఆనందకరమైన విషయం. మీ ఆదరానికి కృతజ్ఞులం. నాతపోబలంతో నిన్నాహ్వానించినందుకు మన్నించు. మరుత్తుని అభీష్టం సిద్ధించింది. నీ చల్లని చూపుల్తో, పరిపూర్ణ సహకారంతో యీ రాజయజ్ఞం పూర్తిఅయి యితడు దివ్యలోకాలు చూరగొనాలి.

జనపతి మునిపతి సంభావనా వాక్కుల్తో ఆదరాభిమానాలతో దేవేంద్రుని హృదయంలో ఆనందలహరి ప్రవహించినట్లైంది. ఆ యజ్ఞవాటిక దేవతా స్త్రీ పురుష కోలాహల ధ్వనుల్తో, మానవుల ఆనంద సంరంభంతో తేలియాడింది. యజ్ఞాంతంలో సంవర్త మహాముని సబహుమానంగా అందించిన సోమపానం స్వీకరించి దేవతలు సమధికానందంతో పొంగిపోయారు. ఆ దృశ్యం చూస్తూ పరవశత్వంతో పొంగిపోయాడు మరుత్త నృపతి. ★




"స్వర్గమందలి సుగంధము"

(కవి మహాశయుడు స్వర్గమందలి సుగంధము అని వర్ణించియున్నట్టి గులాబీ పరిమళము దివ్యముగా తిరిగి వెలపర్చుకొబడి సబ్బులలో రాజా యనదగు పెద్ద-సైజు గోద్రెజ్ నం. 1 యందు యంత్రమూలమున ఇమడ్చబడినది.)

నూతన పరిశోధనలు, పద్ధతులున్నూ, ఆధునిక యంత్రములు మరియు సంవత్సరాల తరబడిగా పొందిన అధికానుభవమున్నూ, ఇతర గోద్రెజ్ సబ్బులతోపాటు ఈ మొదటి కూరగాయల నూనె టాయిలెట్ సబ్బుయందలి సాంప్రదాయంగా పరిశుభ్రపర్చునట్టివిన్నీ, మార్దవకరమైనట్టివిన్నీ పదార్థములను ఇంకా ఎక్కువగా వృద్ధినొందింపజేసినవి.

గోద్రెజ్ నం. 1. టాయిలెట్ సబ్బు

అతి శ్రేష్ఠమైనది మరియు స్వదేశీ




డాక్టర్. రవీంద్రనాథ్ టాగూర్:

"ఏ విదేశసబ్బున్నూ గోద్రెజ్ కంటె శ్రేష్ఠమైనది కాదు అని నే నెరుగుదును; మరియు నేను గోద్రెజ్ సబ్బులను వాడుటయే ముఖ్యంగా నిశ్చయించుకొన్నాను."

గోద్రెజ్ సబ్బులకు అత్యుత్తమ నామచిహ్నము